ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 1 వరంగల్ ఉమ్మడి జిల్లా
గురువారం 2 అక్టోబరు 2025

దసరా వచ్చిందయ్యా...

- ఇంటింటా విందు వినోదాల సందడి
- ఆలయాల్లో శమీ పూజలు
- పలుచోట్ల రావణవధకు ఏర్పాట్లు పూర్తి
- పల్లెపట్నాల్లో పండుగ కోలాహలం



హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ యేటా ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో దశమి తిథితో జరుపుకునే అతి పెద్ద హిందువుల పర్వం దసరా పండగను గురువారం జరుపుకునేందుకు ప్రజాలంతా సన్నద్ధమయ్యారు. పాండ్యమి మొదలుకొని అష్టమి వరకున్న పది రోజులు వైభవంగా శరన్నవరాత్రులు జరుపుకుని వివిధ అలంకారాల్లో అమ్మవారిని పూజించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్నట్లుగా చెడుపై మంచి సాధించిన విజయానికి నాందిగా దసరా పేరిట విజయదశమి పర్వాన్ని వైభవంగా జరుపుకోవడం ప్రతీ యేటా ఆనవాయితీగా వస్తోంది. పర్వదిన వేళ పొద్దున్నే లేచి తలంటు పోసుకొని నూతన వస్త్రాలను ధరించి ఇష్టదైవాలను పూజించిన అనంతరం పిండి వంటలు చేసుకొని మందు, విందుతో ఇంటిల్లిపాది ఉల్లాసంగా గడపడమే ఈ పర్వదిన ప్రత్యేకం. దీనికితోడు సాయంత్రం వేళ ఆలయాలను సందర్శించి జమ్మి చెట్టుకు

మిగతా 2వ పేజీలో...

మహిషాసుర మర్దినిగా భద్రకాళి

- అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



మహిషాసుర మర్దిని అలంకరణలో భద్రకాళి అమ్మవారు

2

మహిషాసుర మర్దినిగా భద్రకాళి



అమ్మవారి సన్నిధిలో పూర్ణాహుతిలో పాల్గొన్న హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవం గా కొనసాగుతున్నాయి. బుధవారం రోజున అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటల కు నిత్య పూజల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజ లు చేశారు. అనంతరం శరభ వాహనంపై, సాయంత్రం పుష్పరథంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ సందర్భంగా యాగశాలలో జరిగిన ప్రత్యేక హోమంలో హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని హోమం అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. వారితో పాటు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దర్శించుకున్నారు. బుధవారం అమ్మవారి దేవాలయానికి వీఐపీల తాకిడి పెరిగింది. పక్క జిల్లాలనుంచి అధికారులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చి దర్శించుకున్నారు.

ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలి..

విజయదశమి, దసరా పండుగ సందర్భంగా గురువారం వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో పైరవీలకు తావీయకుండా సామాన్య భక్తులకు ధర్మ దర్శనానికి ప్రాధాన్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. సిబ్బంది సేవ అంటూ యువకులు గర్భాలయంలో ఉండి నెట్టి వేయడం లాంటి సంఘటనలతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ల ద్వారా భక్తులు దర్శించుకునే విధంగా ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని, వీఐపీ లైన్లు, వికలాంగుల లైన్లు, మీడియా లైన్, భక్తుల ధర్మదర్శనం, ప్రత్యేక టికెట్ దర్శనం లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తుల కిటకిట

బుధవారం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనార్థం తరలి వచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ధర్మదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం టికెట్లతో దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో ముందు గేటు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా కొందరు ప్రైవేటు అర్చకులు ముందు ద్వారం గుండా భక్తులను తీసుకెళ్లడంతో క్యూలైన్లలో వేచి యున్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దసరా వచ్చిందయ్యా..


(1వ పేజీ తరువాయి)

పూజ చేయడం, పాలపిట్టను దర్శించుకోవడం ఈ పర్వదిన వేళ విశిష్టమైందని శాస్త్రాలు చెప్పిన క్రమంలో ప్రజలంతా వీటిని ఆచరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ పర్వదిన జోరు హోరు స్పష్టంగా కనపడుతుంది. ఈ సారి దసరా పర్వం గురువారంతోపాటు జాతిపిత మహాత్మా గాంధీ అయిన అక్టోబరు 2 కలిసి రావడంతో గురువారం రోజు మటన్ షాపులు దసరా వేళ మద్యపాన ప్రియులకు ఇష్టమైన వైన్ షాపులకు కూడా సెలవు కావడంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారమే నగరంలోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు కిటకిటలాడాయి. గురువారం ఉదయం తెల్లవారుజాము 4 గంటలలోపే మటన్ అందించనున్నట్లు హనుమకొండ మటన్ మర్చంట్ అసోసియేషన్ వినియోగదారులకు ప్రకటన చేయడం గమనార్హం.

విజయదశమి వేళ

మహాభారత ఇతిహాసమున పాండవులు అజ్ఞాత సమయంలో విరాట్‌నగర పొలిమేరల్లో ఉన్న శమివృక్షం (జమ్మిచెట్టు)పై ఆయుధాలను భద్రపరిచారని, ఉత్తర గోగ్రహణ వేళ అర్జునుడు ఆ ధనుర్భాణాలను తీసుకొని కౌరవులపై పోరాడి గోవులను తిరిగి సంగ్రహించి విజయం పొందారని అందుకే విజయోత్సహంగా దసరా జరుపుకుంటున్నామన్నది ఒక ప్రతీతి. దీంతోపాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న దశకంఠుడైన రావణసూరిని మహిషాసుర మర్ధిని రూపంలో ఉన్న అమ్మవారు సంహరించిన వేళ చెడుపై మంచి సాధించిన గుర్తుగా దుష్టుని పీడ విరగడైందంటూ ఆనందంగా జరుపుకునే పర్వమే ఈ విజయదశమి అన్న నానుడి కూడా ప్రజల్లో ఉంది.




ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
గురువారం 2 అక్టోబరు 2025






బతుకమ్మకుంటలో రావణ వధకు ఏర్పాట్లు



దసరా వచ్చిందయ్యా..

నేడు విజయదశమి పర్వదినం

సంబరాలకు సన్నాహాలు పూర్తి

జనగామ బతుకమ్మకుంటలో రావణ వధకు ఏర్పాట్లు

గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలు బంద్


బతుకమ్మకుంటలో దసరా వేడుకలకు సిద్ధమైన మైదానం

జనగామ కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయదశమి (దసరా) పర్వదినం జరుపుకునేందుకు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వాసులు రెడీఅయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రజలు గురవారం దసరాను జరుపుకోనున్నారు. పర్వదినం సందర్భంగా ప్రజలు నూతన వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శనం చేసుకొని ఆశీస్సులు అందుకుంటారు. అనంతరం పాలపిట్టను దర్శించుకొని జమ్మి చెట్టుకు పూజలు చేసి జమ్మిఆకుతో దసరా శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మద్యం, మాంసాహారాలతో విందు వినోదాలు జరుపుకుంటారు. ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకునే దసరా సందర్భంగా బట్టల షాపులు, కిరాణా షాపులు కిటకిటలాడాయి. మద్యం కొనుగోలుదారులతో మద్యం షాపులు, బాణసంచా దుకాణాలు సందడిగా మారాయి. విజయదశమిని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని విజయదుర్గామాత దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గడి మైసమ్మ, బొడ్రాయి వద్ద పొట్టేళ్లను బలిస్తారు.

మద్యం, మాంసం విక్రయాలు బంద్

ఈసారి దసరా పండుగ గాంధీజయంతి రోజున రావడంతో మద్యం ప్రియులకు నిరాశ ఎదురైంది. దసరా సందర్భంగా ప్రజలు ఆహ్లాద వాతావరణంలో విందులు జరుపుకుంటారు. కానీ, గురువారం గాంధీ జయంతి కావడంతో మద్యం ప్రియులు కొందరు ముందస్తు కొనుగోళ్ల చేసుకున్నారు. బెల్టు షాపులకు జోరుగా మద్యం రవాణా అయినట్టు (మిగతా 4వ పేజీలో)


రావణవధకు ఏర్పాట్లు ..

దసరా పర్వదినం సందర్భంగా జనగామ జిల్లా బతుకమ్మకుంట మైదానంలో రావణవధకు ఏర్పాట్లు చేశారు. కొంత సమయం పాటు బాణసంచా కాల్చనున్నారు. ప్రజలు దసరా వేడుకలను చూసేందుకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పది తలల రావణాసుర ప్రతిమను ప్రత్యేకంగా తయారు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రజా ప్రతినిధులు, అధికార, అనధికార వర్గాలు హాజరై ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తారు. మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రావణవధకు ఏర్పాట్లు చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని గీతాశ్రమంలో శమీపూజ నిర్వహించి రావణ వధ నిర్వహిస్తారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి: కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని జిల్లాలో రెండు విడతలుగా మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లోనే మోడల్ కోడ్ ఆఫ్ (మిగతా 4వ పేజీలో)






స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, నగలు, నగదు

అధిక డబ్బుల ఆశచూపి మోసం

చైన్ సిస్టమ్ పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు

నగదుతోపాటు, బంగారం స్వాధీనం

వివరాలు వెల్లడించిన పోలీసు కమిషనర్

4





దసరా వచ్చిందయ్యా..

(3వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. దీంతో ముందు రోజే పండుగ సందడి కనిపించింది.

ఆయుధపూజ

దసరా పండుగ రోజు నిర్వహించే ఆయుధపూజ చాలా విశిష్టమైనది, ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడినవారు అస్త్రపూజ చేస్తారు. తమవృత్తికి సంబంధించిన సామగ్రిని, ముఖ్యమైన పరికరాలను అమ్మవారి ఎదుట ఉంచి ఆయుధపూజ నిర్వహిస్తారు. వాహనాలకు, ఫ్యాక్టరీలలో, కర్మా గారాల్లో, వ్యాపార సంస్థల్లో పూజలు నిర్వహిస్తా రు. పోలీసు స్టేషన్లలో ఆ యుధ పూజను నిర్వహి స్తారు. జిల్లాలోని అన్ని పోలీ సు స్టేషన్లలో ఆయుధ పూజ జరుగుతుంది.

విజయదశమి పురస్కరిం చుకొని కొనుగోలుదారులతో మార్కెట్లు సండిగా మారా యి. పండుగ వేళ పండ్లు, పూలు,తమలపాకులు, పలు రకాల స్వీట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా పట్టణాల్లో బంతి, చామంతి, గులాబీల విక్రయాలు జోరందుకున్నాయి. పూలు, గుమ్మడికాయలు, సోరకాకలయు డిమాండ్ పెరిగింది.

పంచ పరివర్తన్‌తో సమాజంలో పరివర్తన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్దయ్య

నర్మెట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐదు మంచి విషయాలను ఆచరిస్తే సమాజంలో తొందరగా పరివర్తన జరుగుతుందని వివేకానంద సేవా సమితి జనగామ జిల్లా అధ్యక్షుడు మేకల బాలసిద్దయ్య అన్నారు. బుధవారం మచ్చుపహాడ్‌లో శివరామకృష్ణ విద్యాలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి వేడుకలు నిర్వహించారు. సామాజిక సమరత, పర్యావరణం, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ, పౌర నియమాలు ఐదు విషయాలను సమాజంలో ప్రతీ పౌరుడు తెలుసుకొని వాటి ఆచరణకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహక బత్తుల నరేందర్, బైరగోని క్రాంతికుమార్, వంగ రవి, పగిడిపల్లి నరహరి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాశ్‌రెడ్డి

జనగామ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి బేతి సుభాశ్ రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో ఎన్నికల కార్యశాల సమావేశంలో సుభాశ్‌రెడ్డి మాట్లాడారు. 10ఏళ్ల పాలనలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కేవీఎల్ఎన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, తోకల ఉమారాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

జనగామ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు మహిషాసుర మర్దనిగా అలంకరించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని దుర్గామాత మండపంలో జరిగిన అన్నదానంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. బాలాజీనగర్, శ్రీరామనాథస్వామి దేవాలయం, అమ్మబావి, రెడ్డిస్ట్రీట్, ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు.

విద్యుదాఘాతంలో గొర్రెలు మృతి

పాలకుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గూడూరు గ్రామ రైతు బెల్లి శ్రీను చెందిన నాలుగు గొర్రెలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందాయి. బాధిత రైతు శ్రీను తెలిపిన వివరాల ప్రకా రం.. రోజు వారిగా వ్యవసాయ క్షేత్రాల్లో గొర్రెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగకు గొర్రెలు తగలడంతో అక్కడికక్కడే నాలుగు గొర్రెలు మృతి చెందినట్లు బాధిత రైతు శ్రీను తెలిపారు. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

అధిక డబ్బుల ఆశచూపి మోసం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

- చైన్ సిస్టమ్ పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు
- నగదుతోపాటు, బంగారం స్వాధీనం

వరంగల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు ఆశ చూపి కోట్లు కొల్లగొట్టిన ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అలాగే నిందితుల నుంచి రూ.5 లక్షల 29 వేల నగదుతో పాటు 684.5 గ్రాముల బంగారు నాణాలు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, ల్యాప్‌టాప్, భూపత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

జనగామ జిల్లా పాలకుర్తిలో నివాసం ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పాలి సైదులు (55), ఆంధ్రప్రదేశ్ నందిగామకు చెందిన మనబోతుల రామకృష్ణ, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌కు చెందిన పొడిల సురేశ్‌కుమార్, హుజూర్‌నగర్‌కు చెందిన పొడిల శ్రీధర్ ముఠాగా ఏర్పడి 2023లో సైదులు భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా అనే ఓ సంస్థను స్థాపించారు. అనంతరం 2024లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అధిక లాభాల ఆశచూపి చిట్టీల వ్యాపారం ప్రారంభించారు. చిట్టీలో చేరే సభ్యులు రూ.6వేలు చెల్లిస్తే రూ.4వేలు తన దగ్గర డిపాజిట్ చేసుకొని రూ.2వేల విలువ చేసే బహుమతులు ఇస్తానంటూ నమ్మించి రూ.300 విలువైన వస్తువులను అందజేసేవారు. ఈ మేరకు చిట్టీలో చేరిన సభ్యుడికి 20నెలల పాటు నెలకు వెయ్యి చొప్పున అందజేసేవారు. అంతేకాక ప్రధాన నిందితుడు మిగతా నిందితులతో కలిసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28,493 సభ్యత్వాలను నమోదు చేయించాడు. సభ్యుల నుంచి రూ.4వేల చొప్పున రూ.11కోట్ల 39 లక్షలను వసూలు చేశాడు. ఇదే కాకుండా రూ.2వేల విలువైన బహుమతులు అని చెప్పి కేవలం రూ.300 విలువైన బహుమతులు ఇవ్వడం ద్వారా రూ.4 కోట్ల 84 లక్షలు మోసం చేసినట్లుగా గుర్తించామన్నారు.

కాగా, వీటికి సంబంధించిన మోసాలపై బాధితులు ప్రధాన నిందితుడు సైదులపై గతంలో మెదక్, సూర్యాపేట, జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 10 కిపైగా చీటింగ్ కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. దీంతో ప్రజలను మోసం చేసి 17 బ్యాంకుల్లో జమచేసిన రూ.5కోట్ల 48 లక్షల64 వేలకు సంబంధించిన లావాదేవీ ఖాతాలను నిలిపివేశామన్నారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్దన్నపేట, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు నర్సయ్య, మధుసూదన్, టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కత్తెరశాల రమేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఛాగల్‌కు చెందిన కత్తెరశాల రమేష్ (44) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఛాగల్‌కు చెందిన రమేష్ మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్‌లో గత కొన్ని ఏళ్లుగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి పెట్రోల్‌పంప్‌లో పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో ఛాగల్ బస్టాండ్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్తున్న కారు రమేష్‌ను ఢీకొట్టింది. దీంతో రమేష్ రోడ్డు పైన ఎగిరిపడడంతో తలకు బలమైన గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది తీవ్రంగా గాయపడిన బాధితుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడి వైద్యులు బాధితుడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. మృతుడి భార్య రాజశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

గాంధీ విగ్రహాలకు ఎనలేని చరిత్ర



రఘునాథపల్లిలోని గాంధీ విగ్రహం

రఘునాథపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని కంచనపల్లి, గబ్బెట గ్రామాలలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలందరు తమ అభిమానాన్ని చాటుకున్నారు. రఘునాథపల్లి రైల్వే స్టేషన్ వెనుక గల కాలనీలో 1969లో గాంధీ విగ్రహన్ని ఏర్పాటు చేశారు. అంటే రఘునాథపల్లి గాంధీకి 56 ఏళ్ల చరిత్ర ఉంది. కంచనపల్లి గ్రామ కూడలి వద్ద 1975లో గాంధీ విగ్రహన్ని గ్రామస్థులు ఏర్పాటు చేశారు. గాంధీ విగ్రహం పక్కనే బస్టాండు, ఆటో స్టాండు, వ్యాపార వాణిజ్య సంస్థలు ఉండడంతో ఆ ప్రాంతాన్ని అందరు గాంధీ చౌరస్తా..గాంధీ బొమ్మ అని పిలువడం అలవాటుగా మారింది. కంచనపల్లి గాంధీకి 50ఏళ్ల చరిత్ర ఉంది. అలాగే మండలంలోని గబ్బెట గ్రామంలో బస్టాండు వద్ద 2006లో గ్రామస్థులందరు కలిసి గాంధీ విగ్రహన్ని ఏర్పాటు చేశారు.

స్తంభం పై నుంచి పడి
జేఎల్ఎంకు గాయాలు



గాయపడిన సతీష్

తరిగొప్పుల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా కరెంట్ స్తంభంపై నుంచి కాలుజారిపడిన ఘటనలో ఓ జూనియర్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం అక్కరాజుపల్లిలో జరిగిన ఘటన గ్రామస్థులు కథనం ప్రకారం. అబ్దుల్‌నాగారం సబ్‌స్టేషన్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కత్తుల సతీష్(35) అక్కరాజుపల్లిలోని ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా దాని స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతుండగా ప్రమాదవాశత్తు కాలు జారడంతో కిందపడ్డాడు. దీంతో ఆయన కడుపులో ఇనుచువ్వ గుచ్చుకుని తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత హైదరబాద్‌కు తరలించారు.

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవీలత
- ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మాధవీలత

చిలుపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీతోపాటు, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవీలత తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్వహణ విషయమై పలు సూచనలు, సలహాలు అందజేశారు. మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని, సామగ్రి సైతం కార్యాలయానికి చేరిందన్నారు. తొలివిడతలో చేపట్టనున్న ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9 నుంచే అభ్యర్థులు నామినేషన్లు వేసుకోవచ్చన్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఈసీ సింగపురం కిరన్‌కుమార్, రాజేశ్వర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపికైన సుమన్



చిర్ర సుమన్

చిలుపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : యూరోపియన్ కమిషన్ ప్రదానం చేయనున్న మేరీ క్యూరీ అంతర్జాతీయ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు పల్లగుట్టకు చెందిన డాక్టర్ చిర్ర సుమన్ ఎంపికయ్యారు. ఈ మేరకు అక్కడి కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 2020లో ఎన్ఐటీ వరంగల్‌లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన సుమన్ తైవాన్‌లోని నేషనల్ చెంగ్ కుంగ్ యూనివర్సిటీలో మెటీరియల్ కెమిస్ట్రీ రంగంలో పోస్ట్ డాక్టోరల్ పరిశోధనలు నిర్వహించారు. సుమన్ మాట్లాడుతూ ఫెలోషిప్‌కు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. యూరప్‌కు వెళ్తున్న సుమన్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుగౌడ్, రత్నాకర్‌రెడ్డి భినందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అపూర్వ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

చిలుపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం చిలుపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 2008 -09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా సమ్మేళనం రూపంలో ఒకేచోట చేరారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నారగోని క్రాంతిసాగర్, గొల్లపల్లి విష్ణు ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు రాజారపు రంజిత్, మాచర్ల కిషన్‌ప్రసాద్, గొల్లపల్లి సాంబశివ, అబ్బరబోయిన లింగయ్య, జీవీఎస్ కాంత్, మచ్చకంటి రాజేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నేతలు

జనగామ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక కారణాలతో బాధపడుతున్న వారిని ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జనగామ డీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు, పాలు ఇస్తున్న తల్లులు, గర్భిణులు, ఆరు నెలలలోపు రిటైర్మెంట్ ఉన్నవారు, దివ్యాంగులు, వైద్య కారణాలతో ఉన్న వారిని ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు చంద్రశేఖర్‌రావు, మదూరి వెంకటేష్, హరిశంకర్, లక్ష్మీభాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



దసరా ఉత్సవాల్లో పాల్గొన్న దొంతుల శేఖర్

జనగామ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి నిర్మాణ మే ధ్యేయంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహకార్యవాహక దొంతుల శేఖర్ అన్నారు. బుధవారం వడ్లకొండలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. శేఖర్ దుర్గామాత చిత్రపటానికి పూలమాల వేసి, చేసి మాట్లాడారు. వంద సంవత్సరాలుగా దేశంకోసం ఆర్‌ఎస్‌ఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టి.జితేందర్, హరీష్, చింతకింది సంతోష్, మామిడి అనిల్, హర్షవర్ధన్, కార్తీక్, నితీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి



విజేతలకు షీల్డు, నగదును అందజేస్తున్న సంజనారెడ్డి

చిలుపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణా యువత రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారులుగా ఎదగాలని దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి కుమార్తె పాగాల సంజనారెడ్డి అన్నారు. బుధవారం రాజవరంలో ఆమె తండ్రి సంపత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న రాజవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) 12వ సీజన్ క్రికెట్ క్రీడా ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను అందించారు. సంజనారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి స్మారకార్థం పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాగాల వెంకట్‌రెడ్డి, మోటం రాజు, ఈర్ల కనకరాజు, రంగు రవి, ఉడుత అశోక్, ఎడ్ల రాజేశ్, శంకర్, నిర్వాహకులు ఎమ్డీ అసదుద్దీన్, ఎడ్ల అబ్రహాం, ఇల్లందుల వెంకటస్వామి, ఇరుగు రాజు, విష్ణు, అశోక్, ఎడ్ల రాహుల్ పాల్గొన్నారు.

జీపీ ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

జనగామ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో పదవులను కూడా డబ్బులతో కొని రాజకీయాలను వ్యాపారంగా మార్చే నీచ నికృష్ట పద్ధతిని ప్రజలందరూ తిరస్కరించాలన్నారు. పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమ్మయ్య, రావుల సదానందం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బావండ్లపల్లి అబ్బయ్య (55) కుటుంబానికి బచ్చన్నపేట పాల ఉత్పత్తిదారుల సంఘం తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందించినట్లు చైర్మన్ బొమ్మెన ఆంజనేయులుగౌడ్ బుధవారం తెలిపారు. అలాగే బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం అందించినట్లు తెలిపారు.

విధుల్లో చేరిన జఫర్‌గడ్ ఎస్ఐ



జఫర్‌గడ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జఫర్‌గడ్ ఎస్ఐగా బి.రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రాంచరణ్ నాయక్ ఇటీవల సస్పెండ్ కావడంతో.. హన్మకొండలోని సుబేదారి ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రామారావును వరంగల్ సీపీ ఇక్కడికి బదిలీ చేసిన విషయం విదితమే.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి: కలెక్టర్

(3వ పేజీ తరువాయి)

కండక్ట్ ఉంటుందన్నారు. జనగామ, స్టేషన్‌ఘనపూర్ మునిసిపాలిటీలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉండదన్నారు. సమావేశాల నిర్వహణ కోసం, ప్రచార సామాగ్రి ముద్రణ కోసం అనుమతి పొందాలన్నారు. పోలింగ్ నిర్వహణలో పాల్గొనే వివిధ పార్టీల ఏజెంట్లు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు బ్యాంగి భాస్కర్, రావెల రవి, జోగు ప్రకాశ్, తాండ్ర అఖిల్, జగదీశ్, జడ్పీ డిప్యూటీ సీఈవో సరిత, డీపీవో స్వరూప పాల్గొన్నారు.